
బేస్తవారిపేట : మహిషాసురమర్దినిగా వాసవీమాత


కంభంలో మహంకాళీ దేవిగా అమ్మవారు


అర్ధవీడు : పాపినేనిపల్లిలో మహిషాసుర మర్దినిగా కన్యకాపరమేశ్వరి


మార్కాపురం : శాకంబరీగా దర్శనమిస్తున్నముద్దసానమ్మ తల్లి


మార్కాపురం : విజయలక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు

జయ జయహే మహిషాసురమర్దిని


బేస్తవారిపేట : మహిషాసురమర్దినిగా చౌడేశ్వరీదేవి


మార్కాపురం : గజలక్ష్మిగా వాసవీమాత


కొనకనమిట్ల : గొట్లగట్టులో కుంకుమార్చన పూజలు



కొనకనమిట్ల : పెదారికట్లలో హోమంలో పాల్గొన్న భక్తులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. పదో రోజు బుధవారం మహర్నవమి సందర్భంగా ప్రముఖ ఆలయాల్లో అమ్మవారి మూలవిగ్రహమూర్తులను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

- మహర్నవమి సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన జగన్మాత
- చండీ హోమాలు, కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు


మార్కాపురం : చండీ అలంకారంలో జగదాంబ అమ్మవారు


గిద్దలూరు : కనకదుర్గమ్మ ఆలయంలో మహిషాసురమర్దినిగా..


కొనకనమిట్ల : గొట్లగట్టులో మహిషాసురమర్దినిగా వాసవీమాత

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారు మహిషాసురమర్దినిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో బాలహృదయేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కంభం: స్థానిక అమ్మవారిశాలలో వాసవీమాత మహంకాళీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గిద్దలూరు రూరల్: స్థానిక నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయం, కాశినాయకుంటలోని గాయత్రిమాత ఆలయం, రేడియోబావి సమీపంలోని కాళికామాత ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని రూపంలో దర్శనమిచ్చారు. వాసవి మాతను వారాహిగా అలంకరించి పూజలు చేశారు. చండీ హోమం, కలశపూజ, సామూహిక కుంకుమ పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్ధవీడు: స్థానిక అంకభూపాలెంలో పోలేరమ్మ, రామాలయం, పాపినేనిపల్లిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అర్ధవీడులోని పోలేరమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

చండీదేవిగా జగదాంబ

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని చెన్నకేశవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మిగా, మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు చండీదేవీగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత గజలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. విజయదశమి సందర్భంగా గురువారం సాయంత్రం చెన్నకేశవ స్వామివారి పార్వేట ఉత్సవం దసరా మండపం వద్ద నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శాకంబరీగా ముద్దసానమ్మ తల్లి

మార్కాపురం: మండలంలోని కోలభీమునిపాడు సమీపంలో ముద్దసానమ్మ గండివద్ద ఉన్న అమ్మవారిని అర్చకులు బుధవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ముందుగా అమ్మవారికి తేనె, పాలు, పెరుగు, పసుపు, కుంకుమ, కొబ్బరినీళ్లతో అభిషేకం నిర్వహించారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మాలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు.

నేడు మాంసం, మద్యం విక్రయాలు నిషేధం

గిద్దలూరు రూరల్: గాంధీ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని చికెన్, మటన్, మద్యం షాపులు నిర్వహించరాదని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విక్రయాలపై నిషేధం విధించినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

క్లుప్తంగా

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు దసరా

- ప్రజలకు అన్నా రాంబాబు, జంకె శుభాకాంక్షలు


అన్నా రాంబాబు


జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండగ నిర్వహించుకుంటామని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్మాత ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పండగ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

అక్రమంగా బాణసంచా నిల్వ చేస్తే చర్యలు


కంభంలో ఓ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

కంభం: నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వ ఉంచితే చర్యలు తప్పవని సీఐ కె.మల్లికార్జున హెచ్చరించారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఎస్సై నరసింహారావుతో కలిసి పట్టణంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులొచ్చినా, తనిఖీల్లో పట్టుబడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులకు స్పష్టం చేశారు.

బహిరంగంగా మద్యం తాగితే కేసులు


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన కమిషనర్ నారాయణరావు


స్థానికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మల్లికార్జున రావు

– డీఎస్పీ నాగరాజు హెచ్చరిక

మార్కాపురం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ యు.నాగరాజు హెచ్చరించారు. బుధవారం ఆయన సీఐ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావుతో కలిసి పట్టణ శివారు ప్రాంతాల్లోని మార్కెట్‌యార్డు, వై.జంక్షన్ తదితర ప్రాంతాల్లో మందుబాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లోని ఖాళీ మద్యం బాటిళ్లను తొలగింపజేశారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. మద్యం తాగుతూ మరోసారి పట్టుబడితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. మద్యం మత్తులో టూవీలర్లు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దని హితవు పలికారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్షతోపాటు జరిమానా తప్పదని హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కమిషనర్ సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

కంభం: బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగినా, అక్రమంగా మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవని కంభం సీఐ మల్లికార్జున హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి స్థానికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో ఖాళీ మద్యం సీసాలను గుర్తించారు. రోడ్ల వెంబడి, పంట పొలాల్లో మద్యం తాగి వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎస్సై నరసింహారావు, సిబ్బంది ఉన్నారు.

వన్యప్రాణులను వేటాడితే నేరం


వాహనాలు తనిఖీ చేస్తున్న అటవీశాఖ అధికారులు

అర్ధవీడు: దసరా సందర్భంగా మాంసం కోసం అడవి జంతువులను వేటాడే అవకాశం ఉండటంతో బుధవారం సాయంత్రం ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ జిరంగారెడ్డి ఎక్స్, టీ జంక్షన్లలో వాహనాలు తనిఖీ చేశారు. అడవి జంతువులను వేటాడినా, మాంసం విక్రయించినట్లు తేలినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.

బైకును ఢీకొట్టిన ఆటో


వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న సుబ్బారెడ్డి

కంభం: బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం అర్ధరాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బస్టాండ్ రోడ్డులో ఉన్న వెంకటేశ్వర హాస్పిటల్ ఎదురుగా ఆటో ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న బుక్కా హర్షవర్ధన్ ఎడమ కాలుకు తీవ్ర గాయాలు కాగా, ఆటో డ్రైవర్ భూపని రంగనాయకులుకు ముఖము, ఇతర చోట్ల గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. ద్విచక్ర వాహనదారుడికి పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్ల సమీపంలో కాశీనాయన ఆశ్రమం వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. బసినేపల్లెకు చెందిన ఆవుల సుబ్బారెడ్డి, వై.శ్రీనివాసులు బైక్‌పై బేస్తవారిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కాశీనాయన ఆశ్రమం సమీపంలోని మూలమలుపులో మోటార్‌సైకిల్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో ఇద్దరు వ్యక్తులకు చేతులు, ముఖంపై గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బేస్తవారిపేట 108 సిబ్బంది క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.